వొండ్రుసోవాకు షాక్

తొలి రౌండ్‌లోనే డిఫెండింగ్ చాంపియన్ ఔట్

వింబుల్డన్‌లో సంచలనం ● మొదటి రౌండ్‌లోనే నాగల్ నిష్క్రమణ

లండన్: రెండ్రోజుల క్రితమే మొదలైన వింబుల్డన్‌లో పెను సంచలనం నమోదైంది. ఈ ఏడాది మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన చెక్ రిపబ్లిక్ అమ్మాయి మర్కెట వొండ్రుసోవా 4-6, 2-6తో అన్‌సీడెడ్ జెస్సికా మనెరొ (స్పెయిన్) చేతిలో పరాభవం పాలైంది. సెంటర్ కోర్టు వేదికగా 66 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో వొండ్రుసోవా కనీస పోరాట పటిమ కూడా చూపకుండా వెనుదిరిగింది. టెన్నిస్‌లో ఓపెన్ శకం మొదలయ్యాక వింబుల్డన్‌లో 1994 (స్టెఫీ గ్రాఫ్) తర్వాత డిఫెండింగ్ చాంపియన్ తొలి రౌండ్‌లోనే ఇంటి బాట పట్టడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. గతేడాది జరిగిన ఈ టోర్నీలో అనూహ్యమైన ఆటతీరుతో తనకంటే మెరుగైన ఆటగాళ్లను మట్టికరిపించి చాంపియన్‌గా నిలిచిన వొండ్రుసోవా ఈసారి మాత్రం మొదటి రౌండ్‌కే నిష్క్రమించింది. 21 ఏండ్ల స్పెయిన్ అమ్మాయి మనెరొ ఆరంభం నుంచే ఆధిక్యం చెలాయిస్తూ వరుస సెట్లతో పాటు మ్యాచ్‌నూ సొంతం చేసుకుంది.

పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండో సీడ్, గతేడాది రన్నరప్ నొవాక్ జొకోవిచ్ 6-1, 6-2, 6-2తో అన్‌సీడెడ్ కొప్రివాపై అలవోకగా గెలిచాడు. నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6-2, 6-4, 6-2తో రాబర్టొ (స్పెయిన్) పై విజయం సాధించాడు. కానీ ఆరో సీడ్ ఆండ్రీ రుబ్లెవ్ 4-6, 7-5, 2-6, 6-5 (5/7)తో అర్జెంటీనా ఆటగాడు ఫ్రాన్సిస్కో కొమెసన చేతిలో ఓడాడు. భారత యువ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నాగల్ 2-6, 6-3, 3-6, 4-6తో మియొమిర్ కెక్‌మనోవిక్ (సెర్బియా) చేతిలో పరాభవం పాలై తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు.

చలో జింబాబ్వే

తొలి రెండు మ్యాచ్‌లకు జట్టులో స్వల్ప మార్పులు

సాయి, జితేశ్, హర్షిత్‌కు పిలుపు

హరారేకు బయల్దేరిన యువ భారత్

ముంబై: పదిహేడేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత టీ20 ప్రపంచకప్ గెలిచిన మూడ్ నుంచి అభిమానులు ఇంకా బయటకు రాకముందే భారత జట్టు మరో పర్యటనకు వెళ్లింది. సీనియర్ల గైర్హాజరీలో కుర్రాళ్లు జింబాబ్వేతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడేందుకు కుర్రాళ్లతో కూడిన యువ భారత్ మంగళవారం ముంబై విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో హరారే బయల్దేరింది. రియాన్ పరాగ్, తుషార్ దేశ్‌పాండే, అభిషేక్ శర్మ, రుతురాజ్, బిష్ణోయ్ వంటి యువకులతో కూడిన ఈ జట్టుకు నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ హెడ్‌కోచ్‌గా వ్యవహరించనున్నాడు.

ఆ ముగ్గురికి పిలుపు:

ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యులుగా ఉన్న సంజూ శాంసన్, యశస్వీ జైస్వాల్, శివమ్ దూబె తుఫాను కారణంగా బార్బడోస్‌లోనే ఆగిపోవడంతో తొలి రెండు టీ20లకు ఆ ముగ్గురూ దూరమయ్యారు. దీంతో బీసీసీఐ వారి స్థానాలను ఐపీఎల్‌లో అదరగొట్టిన సాయి సుదర్శన్, జితేశ్ శర్మ, హర్షిత్ రాణాతో భర్తీ చేసింది. లండన్‌లో కౌంటీ క్రికెట్ ఆడుతున్న సాయి బీసీసీఐ ఆదేశాలతో లండన్ నుంచి హుటాహుటిన హరారే విమానమెక్కాడు. భారత్‌కు వచ్చాక శాంసన్, జైస్వాల్, దూబె జింబాబ్వే వెళ్లనున్నారు. మిగిలిన మూడు మ్యాచ్‌ల నాటికి ఆ ముగ్గురూ అందుబాటులో ఉంటారని బీసీసీఐ పేర్కొంది. ఇక జింబాబ్వే టూర్‌లో భారత జట్టుకు సారథిగా వ్యవహరించనున్న శుభ్‌మన్ గిల్ అమెరికా నుంచి నేరుగా హరారేకు వెళ్లాడు. రోహిత్, కోహ్లీ, జడేజా వంటి సీనియర్లు టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన నేపథ్యంలో జట్టులో స్థానం సుస్థిరం చేసుకునేందుకు కుర్రాళ్లకు ఈ పర్యటన కీలకం కానుంది. ఈనెల 6 నుంచి 14 దాకా జరుగబోయే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు హరారే ఆతిథ్యమివ్వనుంది.

పూమా ప్రచారకర్తలుగా నితీశ్, పరాగ్

ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ బ్రాండ్ పూమా.. ఐపీఎల్‌లో సత్తా చాటి భారత జట్టుకు ఎంపికైన యువ క్రికెటర్లు నితీశ్ కుమార్ రెడ్డి, రియాన్ పరాగ్‌తో జట్టు కట్టింది. నితీశ్, పరాగ్ పూమాకు ప్రచారకర్తలుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది.

థ్యాంక్యూ రోహిత్..

● ద్రావిడ్ భావోద్వేగం

బార్బడోస్: టీమ్‌ఇండియాకు పదేండ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీని అందించడంలో కీలకపాత్ర పోషించిన రాహుల్ ద్రావిడ్.. హెడ్‌కోచ్‌గా తన ఆఖరి ప్రసంగంలో సారథి రోహిత్ శర్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. గతేడాది వన్డే వరల్డ్ కప్ తర్వాత హెడ్‌కోచ్ బాధ్యతల నుంచి వైదొలుగుదామని అనుకున్నానని, కానీ రోహిత్ ఫోన్ చేసి తనను ఒప్పించాడని ద్రావిడ్ అన్నాడు. 'రో.. గతేడాది నవంబర్‌లో నువ్వు నాకు ఫోన్ చేసి కోచ్‌గా కొనసాగాలని అడిగావు. అందుకు థ్యాంక్యూ వెరీ మచ్..' అంటూ భావోద్వేగపూరితంగా మాట్లాడాడు. ఇది ఏ ఒక్కరి విజయమో కాదని, సమిష్టిగా ఆడటం వల్లే ఐసీసీ ట్రోఫీ కల నెరవేరిందని చెప్పుకొచ్చాడు. జట్టులో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన ద్రావిడ్.. ఈ విజయాన్ని ఆస్వాదించాలని, ఆటగాళ్లు వ్యక్తిగతంగా చేసిన పరుగులు, తీసిన వికెట్ల కంటే ఇలాంటి మధుర క్షణాలే కలకాలం గుర్తుంటాయంటూ ద్రావిడ్ మాట్లాడిన వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలలో పోస్ట్ చేసింది.

ఇంగ్లండ్ జట్టులో వాన్, ఫ్లింటాఫ్ కుమారులు

లండన్: ఇంగ్లండ్ దిగ్గజ ఆటగాళ్లు ఆండ్రూ ఫ్లింటాఫ్, మైఖెల్ వాన్ కుమారులు వాళ్ల తండ్రుల అడుగుజాడల్లోనే నడుస్తున్నారు. శ్రీలంకతో స్వదేశంలో జరుగబోయే రెండు టెస్టుల కోసం ఇంగ్లండ్ తాజాగా ప్రకటించిన అండర్-19 జట్టులో ఫ్లింటాఫ్ కొడుకు రాకీ ఫ్లింటాఫ్, వాన్ కుమారుడు ఆర్చీ వాన్ చోటు దక్కించుకున్నారు. వీళ్లిద్దరితో పాటు సీనియర్ టెస్టు జట్టులో సభ్యుడిగా ఉన్న రిహాన్ అహ్మద్ సోదరుడు ఫర్హాన్ అహ్మద్ సైతం ఎంపికయ్యాడు. జూలై 8 నుంచి 19 దాకా ఇంగ్లండ్.. లంకతో రెండు టెస్టులు ఆడనుంది. ఈ టెస్టులలో రాణిస్తే వీళ్లు జాతీయ జట్టు సెలక్టర్ల దృష్టిలో పడే అవకాశముంది.

క్వార్టర్స్‌కు పోర్చుగల్

● **ఫ్రాన్స్‌తో అమీతుమీకి సిద్ధం**

ఫ్రాంక్‌ఫర్ట్: యూరో కప్‌లో పోర్చుగల్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. మంగళవారం ఉత్కంఠగా జరిగిన రౌండ్ ఆఫ్ 16 పోరులో పోర్చుగల్ 3-0తో స్లోవేనియాను ఓడించింది. పెనాల్టీ షూటౌట్ ద్వారా తేలిన ఈ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. మ్యాచ్ నిర్దేశిత సమయం(90 నిమిషాలు)తో పాటు ఎక్స్‌ట్రా టైమ్‌లోనూ ఇరుజట్లూ గోల్ చేయలేకపోవడంతో పెనాల్టీ షూటౌట్ ద్వారా ఫలితాన్ని తేల్చాల్సి వచ్చింది. షూటౌట్‌లో పోర్చుగల్ నుంచి క్రిస్టియానో రొనాల్డో, బ్రూనో ఫెర్నాండెజ్, బెర్నార్డొ సిల్వ గోల్స్ చేయగా స్లోవేనియా తరఫున జొసిఫ్, బల్కొవెక్, బెంజిమెన్ కొట్టిన గోల్స్‌ను పోర్చుగల్ గోల్ కీపర్ డియాగొ కొస్టా అద్భుతంగా అడ్డుకుని తన జట్టును క్వార్టర్స్ చేర్చాడు. అయితే ఈ మ్యాచ్ ఎక్స్‌ట్రా టైమ్‌లో వచ్చిన పెనాల్టీ కిక్ అవకాశాన్ని మిస్ చేసుకోవడంతో రొనాల్డో కన్నీటిపర్యంతమయ్యాడు. ఈ సందర్భంగా స్టాండ్స్‌లో మ్యాచ్ చూస్తున్న అతడి తల్లి సైతం కన్నీళ్లు పెట్టుకోవడం నెటిజన్లను కలిచివేసింది. కానీ షూటౌట్‌లో మాత్రం రొనాల్డో ఆ తప్పు చేయలేదు. ఇక రౌండ్ ఆఫ్ 16లో బెల్జియంను 0-1తో ఓడించిన ఫ్రాన్స్‌తో క్వార్టర్స్‌లో పోర్చుగల్ అమీతుమీ తేల్చుకోనుంది. స్పెయిన్, జర్మనీ, ఇంగ్లండ్, స్విట్జర్లాండ్ సైతం క్వార్టర్స్ చేరాయి.

ఈనెల 27 నుంచి డ్యూరాండ్ కప్

కోల్‌కతా: ఆసియాలోనే అత్యంత పురాతనమైన ఫుట్‌బాల్ టోర్నీగా గుర్తింపుపొందిన డ్యూరాండ్ కప్ ఈనెల 27 నుంచి మొదలవనుంది. 133వ ఎడిషన్‌గా జరుగనున్న ఈ ప్రతిష్టాత్మక టోర్నీని జులై 27 నుంచి ఆగస్టు 31 దాకా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 24 జట్లు పాల్గొనబోయే ఈ మెగా టోర్నీలో ఇండియన్ సూపర్ లీగ్, ఐ-లీగ్ జట్లతో పాటు పలు అంతర్జాతీయ జట్లూ పోటీపడే అవకాశముంది. ఈసారి కోల్‌కతా, కోక్రఝార్ (అస్సాం)తో పాటు కొత్తగా జంషెడ్‌పూర్, షిల్లాంగ్ మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తున్నాయి. 24 జట్లు ఆరు గ్రూపులుగా విడిపోయి తలపడబోయే ఈ టోర్నీ రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో జరుగుతుంది.

హైదరాబాద్ సెయిలింగ్ వీక్ ఆరంభం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్టాత్మక హైదరాబాద్ సెయిలింగ్ వీక్ పోటీలు మంగళవారం నుంచి ఘనంగా మొదలయ్యాయి. హుస్సేన్‌సాగర్ వేదికగా జరుగుతున్న 38వ ఎడిషన్ పోటీల ప్రారంభ కార్యక్రమానికి సీనియర్ కల్నల్ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ జేఎస్ సిదానా హాజరయ్యారు. ఐఎల్‌సీఏ 7, ఐఎల్‌సీఏ 6, ఐఎల్‌సీఏ 4 విభాగాలలో పోటీలు జరుగుతాయి. ఈ ఏడాది జరిగే పోటీలు సెయిలర్లకు యాచింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైఏఐ) ర్యాంకింగ్ ఈవెంట్‌గా ఉపయోగపడనున్నాయి.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.